
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 నంద్యాల జిల్లా వార్తలు
శుక్రవారం 17 మే 2024





జొన్నగిరి వద్ద
జియో మైసూర్ ఏర్పాటు చేసిన గోల్డ్ ప్రాజెక్టు



జొన్నగిరి వద్ద నిర్మాణంలో జియో మైసూర్ గోల్డ్ ప్రాజెక్టు యూనిట్

బంగారం వెలికితీసే యంత్రం

స్వర్ణ సీమ..!

- రాయలసీమ రాళ్లసీమ కాదు.. బంగారు సీమ
- జొన్నగిరిలో గోల్డ్ మైన్ ప్రాజెక్టు ప్లాంట్ నిర్మాణం
- జియో మైసోర్ సంస్థ ఆధ్వర్యంలో బంగారు గని తవ్వకాలు
- ఈ ఏడాది ఆఖరిలోగా బంగారు ఉత్పిత్తికి సన్నాహాలు
- దేశంలోనే తొలి ప్రైవేట్ గోల్డ్ ప్రాజెక్టు ఇదే..
- 200 మందికి పైగా ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఉపాధి అవకాశాలు

కర్నూలు, మే 16 (ఆంధ్రజ్యోతి):

కేజీఎఫ్ అంటే గుర్తుకొచ్చేది కోలార్ గోల్డ్ ఫీల్డ్. కర్నూలు జిల్లాలోనూ అలాంటి గోల్డ్ ఫీల్డ్ ఒకటుంది. అదే 'జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్'. రాయలసీమ రాళ్లసీమ అనే నానుడి.. ఇకపై బంగారు సీమగా మారనుంది. ఎప్పటి నుంచో ఇక్కడ బంగారు నిక్షేపాలు ఉన్నాయని అంటున్నారు. జియో మైసోర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ సంస్థ పరిశోధనలు చేసి బంగారు నిక్షేపాలు ఉన్నాయని నిర్ధారించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులతో గోల్డ్ మైనింగ్‌కు శ్రీకారం చుట్టింది. రూ.200 కోట్లతో చేపట్టిన జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రాజెక్టు, ప్రాసెసింగ్ ప్లాంట్ పనులు దాదాపు 65 శాతం పూర్తయినట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. దక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (డీజీఎంఎల్)కి ఈ సంస్థలో వాటాలు ఉన్నాయి. జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రాజెక్టులో ఈ ఏడాది ఆఖరులోగా బంగారం వెలికితీత మొదలు కానున్నట్లు సమాచారం. లక్ష్యం ఏడాదికి 750 కిలోల బంగారు వెలికితీత. ప్రైవేటు రంగంలో దేశంలోనే తొలి గోల్డ్ మైన్ ఇదే కావడం ప్రత్యేకత.

కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి ప్రాంతంలో బంగారు నిక్షేపాలు ఉన్నాయని ఎప్పటి నుంచో అంటున్నారు. ఈ ప్రాంతంలో తొలికరి వర్షాలు కురిసే సమయంలో వజ్రాలు లభిస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వజ్రాల అన్వేషణకు జనం వస్తుంటున్నారు. ఏటా రూ.లక్షల విలువైన వజ్రాలు లభిస్తున్నాయి. ఈ ప్రాంతంలో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు 1994లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) సర్వే చేసి గుర్తించింది. గోల్డ్ మైనింగ్ రంగంలో విదేశీ పెట్టుబడుల కోసం కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. జొన్నగిరి కేంద్రంగా గోల్డ్ మైనింగ్ (బంగారు గని)కోసం 2005లో జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ సంస్థ దరఖాస్తు చేస్తే.. వివిధ కారణాలు వల్ల అనుమతులకు జాప్యం జరుగుతూ వచ్చింది. రాష్ట్ర విభజన తరువాత 2013లో గోల్డ్ మైనింగ్ కోసం జియో మైసూర్ సంస్థకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అన్ని రకాల అనుమతులు లభించడంతో.. 2014లో బంగారు గనుల తవ్వకాల కోసం ప్రణాళికలు తయారు చేసుకున్న ఆ సంస్థ 250 ఎకరాలు కొనుగోలు చేసింది. మరో 1,500 ఎకరాలు రైతుల నుంచి లీజుకు తీసుకొని ఎకరానికి ఏటా రూ.15 వేలు లీజులు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. 250 ఎకరాల్లో మైనింగ్, డంప్‌యార్డు, గోల్డ్ ప్రాసెసింగ్ యూనిట్, వాటర్ రిజర్వాయర్ నిర్మాణాలు చేస్తున్నారు. ఇప్పటికే ప్లాంట్ పనులు దాదాపుగా 65 శాతం పూర్తయినట్లు ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొంటున్నారు.

పైలెట్ ప్రాజెక్టులో భాగంగా గోల్డ్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా గోల్డ్ ఉత్పత్తి ప్రక్రియ



దేశంలో తొలి ప్రైవేటు బంగారు గని

కోలార్ గోల్డ్ ఫీల్డ్ (కేజీఎఫ్)గా చరిత్ర సొంతం చేసుకున్న కోలార్ గోల్డ్ మైన్ స్వాతంత్ర్యానికి పూర్వం 1880లోనే ఆనాటి బ్రిటీష్ పాలనలో మొదలు పెట్టారు. ఆ తరువాత 1945లో రాయచూరు వద్ద హట్టి గోల్డ్ మైన్స్ ప్రారంభించారు. స్వాతంత్ర్యం తరువాత దేశంలో ఎక్కడా కూడా గోల్డ్ మైన్ చేపట్టలేదని అంటున్నారు. ప్రైవేటు రంగంలో తొలి గోల్డ్ ప్రాజెక్టుగా జొన్నగిరి గోల్డ్ మైనింగ్, ప్రాసెసింగ్ యూనిట్‌ను జియో మైసూర్ సంస్థ నిర్మిస్తుండడం రాయలసీమకే ప్రత్యేక స్థానం దక్కుతుందని మైనింగ్ నిపుణులు పేర్కొంటున్నారు. జొన్నగిరి పేరు గోల్డ్ మైనింగ్ చరిత్రకెక్కనుంది.

రూ.200 కోట్ల పెట్టుబడి..!

జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టును జియో మైసూర్ సంస్థ రూ.200 కోట్లతో చేపడుతోంది. ఇప్పటికే సగానికిపైగా పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది ఆఖరులోగా బంగారు ఉత్పత్తి చేపట్టే అవకాశాలు ఉన్నాయని ఆ సంస్థ డిప్యూటీ జీఎం హరికిరణ్ ఆలపాటి ఆంధ్రజ్యోతికి వివరించారు. జియో మైసోర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ చేపట్టిన ఈ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టులో దక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (డీజీఎంఎల్)కు దాదాపు 40-49 శాతం వరకు వాటాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఈ గోల్డ్ ప్రాజెక్టు ఉత్పత్తి మొదలు పెడితే ప్రత్యేక్షంగా, పరోక్షంగా 200-250 మందికి పైగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంటున్నారు.



పైలెట్ ప్రాజెక్టులో భాగంగా గోల్డ్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా గోల్డ్ ఉత్పత్తి ప్రక్రియ

టార్గెట్.. ఏటా 750 కిలోల బంగారు వెలికితీత

ఏడాదికి 750 కిలోల బంగారు వెలికితీత లక్ష్యంగా జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ సంస్థ, దక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (డీజీఎల్ఎల్) జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టును చేపట్టింది. ఇప్పటికే బంగారు నిక్షేపాల తవ్వకాలు, ప్రాసెసింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. లీజులకు తీసుకున్న భూముల్లో ప్రతి 20 మీటర్లకు ఒక డ్రిల్లింగ్ తవ్వి గోల్డ్ మైన్ నాణ్యత, లభనష్టాలపై అంచనా వేసేందుకు పైలెట్ ప్రాజెక్టు చేపట్టిన ఆ సంస్థ సత్ఫలితాలు రావడంతో పూర్తిస్థాయి గోల్డ్ మైనింగ్, ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ పనులు కూడా దాదాపుగా 65 శాతం పూర్తయ్యాయి. ఈ ఏడాది ఆఖరు నాటికి బంగారు ఉత్పత్తి మొదలు కానుంది. ఇక్కడే కాదు.. రాష్ట్రంలో చిత్తూరు, అనంతపురం జిల్లాల్లోనూ పలు ప్రాంతాల్లో బంగారు నిక్షేపాలు గుర్తించినట్లు తెలుస్తుంది. ఈ జిల్లాల్లో గోల్డ్ మైనింగ్ ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ ఆసక్తి చూపుతోంది. ఏదిఏమైనా రాళ్లసీమగా ప్రసిద్ధి చెందిన రాయలసీమ జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టు రాకతో 'స్వర్ణసీమ'గా మారనుంది. ఈ ప్రాజెక్టు వల్ల కరువు పల్లెసీమల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడి వలసలు ఆగుతాయని పలువురు పేర్కొంటున్నారు.

నాటి సువర్ణగిరి.. నేటి జొన్నగిరి

ప్రాచీన కాలంలో ఈ ప్రాంతాన్ని సువర్ణగిరిగా పిలిచేవారని చరిత్రకారులు చెబుతున్నారు. ఇక్కడి భూముల్లో బంగారు నిక్షేపాలు ఉన్నాయని ఆనాడే గుర్తించారేమో..! అందుకే సువర్ణగిరి అని పిలిచేవారని స్థానికులు అంటున్నారు. కాలక్రమేనా సువర్ణగిరి కాస్తా.. సొన్నగిరిగా.. ఆ తరువాత జొన్నగిరి రూపాంతరం చెందింది. అంతేకాదు జొన్నగిరి ఒక గ్రామం మాత్రమే కాదు.. అశోకుడి కాలంలో అశోక సామ్రాజ్యానికి దక్షిణ ప్రాంత ప్రధాన కార్యాలయంగా ఉండేదని అంటున్నారు. క్రీస్తు పూర్వం 3వ శతాబ్దానికి చెందిన అశోకుడి శిలా శాసనాలు కూడా జొన్నగిరికి సమీపంలో గుర్తించారు. అలయానికి సమీపంలో భారీ రాతిబావి ఉంది. ఆనాడే బంగారు నిక్షేపాలు వెలికితీసేందుకు ఈ బావి తవ్వి ఉండవచ్చని చరిత్రకారుల ద్వారా తెలుస్తోంది. చోళుల కాలంలో కూడా జొన్నగిరి ప్రాంతంలో బంగారు నిక్షేపాలు స్వాధీనం చేసుకున్నారని చరిత్ర చెబుతోంది. బ్రిటీష్ కాలంలో కూడా బంగారు నిక్షేపాల కోసం అన్వేషణ చేసినట్లు తెలుస్తుంది. 1991-94 మధ్య జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) సర్వేలో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించడం, గోల్డ్ మైనింగ్ కోసం జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ సంస్థ అన్ని రకాల అనుమతులు సాధించింది. దాదాపు రూ.200 కోట్ల పెట్టుబడితో జొన్నగిరి గోల్డ్ మైనింగ్, ప్రాసెసింగ్ యూనిట్ పనులు చేపట్టడంతో జొన్నగిరికి మళ్లీ నాటి సువర్ణగిరి పేరుతో ఖ్యాతికెక్కనుంది.

ఓటమిని గ్రహించే వైసీపీ దాడులు

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కేఈ కృష్ణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కేఈ కృష్ణమూర్తి తదితరులు

కర్నూలు(అర్బన్), మే 16: ఓడిపోతున్నామని గ్రహించే రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ వైసీపీ వరుస దాడులకు పాల్పడుతోందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కేఈ కృష్ణమూర్తి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు మరోసారి బాధ్యతలు చేపట్టబోతున్నారని ఆయన వెల్లడించారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేఈ కృష్ణమూర్తి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకత్వంలోని ఎన్డీయే విజయం సాధించడం ఖాయమన్నారు. 2019లో మోసపూరిత వాగ్దానాలిచ్చి, ఒక్క అవకాశమంటూ ప్రజలను బతిమాలి జగన్ మోహన్ రెడ్డి సీఎం అయ్యారన్నారు. తర్వాత రాష్ట్రాన్ని ఆయన అన్నివిధాలుగా నాశనం చేశాడని ఆరోపించారు. జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. అందుకే ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓపిగ్గా టీడీపీకి ఓట్లు వేశారన్నారు. రాష్ట్రాన్ని జగన్ బారి నుంచి కాపాడుకునేందుకు లక్షల మంది సుదూర ప్రాంతాల నుంచి స్వస్థలాలకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను తీర్చిదిద్దగల శక్తి సామర్థ్యాలు ఒక్క చంద్రబాబు నాయుడుకే ఉన్నాయని అన్నారు. ఆయనకు ఉన్న సుదీర్ఘ పరిపాలన అనుభవంతో రాష్ట్రాన్ని బాగుచేస్తారని ప్రజలు విశ్వసించారన్నారు. ఓటమి భయంతోనే ఎన్నికలు పూర్తి అయిన తర్వాత కూడా వైసీపీ మూకలు టీడీపీ శ్రేణులు, సానుభూతిపరులపైన దాడులకు పాల్పడుతున్నాయని అన్నారు. ఓటమి ఖాయమని గ్రహించే వైసీపీ ఇలాంటి దాడులకు పాల్పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు వై .నాగేశ్వరరావు యాదవ్, ఆకెపోగు ప్రభాకర్, కే.ఈ.జగదీష్, ప్రసాద్, నాగరాజు యాదవ్, సత్రం రామకృష్ణుడు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బుగ్గన సేవలో పోలీసులు...?

- మంత్రిని కాదంటే.. కేసులే..!
- పోలింగ్ తర్వాత అధికారిక అరాచకాలు
- టీడీపీ నాయకులే టార్గెట్
- డోన్‌లో అదుపుతప్పిన శాంతి భద్రతలు

డోన్, మే 16: ఎన్నికల పోలింగ్ ముగిసినా డోన్ నియోజకవర్గంలో పోలీసులు మంత్రి బుగ్గన సేవలో తరిస్తున్నారు. మంత్రిని కాదంటే.. కేసులు, అరెస్టులు తప్పడం లేదు. టీడీపీ నాయకులను టార్గెట్ చేసి వేధిస్తున్నారనే విమర్శలున్నాయి. దీనికి బుధవారం జరిగిన టీడీపీ నాయకుల అరెస్టులే నిదర్శనం. ప్యాపిలి మండలంలోని గార్లదిన్నె గ్రామానికి చెందిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్ సీమ సుధాకర్ రెడ్డి, వీఆర్వో మల్లారెడ్డి కుటుంబ సభ్యులు ఎన్నికల సమయంలో వైసీపీని వీడారు. మంత్రి బుగ్గన ఎంత అడ్డుకున్నప్పటికీ .. సీమ సుధాకర్‌రెడ్డి, ఆయన అనుచరులు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అంతకు ముందు ఫిబ్రవరిలో గార్లదిన్నె గ్రామంలో జరిగిన ఘటన నేపథ్యంలో సీమ సుధాకర్ రెడ్డితో పాటు మరో ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎన్నికల సమయంలో టీడీపీలో చేరారని మంత్రి బుగ్గన సీమ సుధాకర్‌రెడ్డి, వీఆర్వో మల్లారెడ్డి కుటుంబ సభ్యులను టార్గెట్ చేశారు. పోలీసులు కూడా అత్యుత్సాహం ప్రదర్శించారన్న విమర్శలున్నాయి. మంత్రి బుగ్గన ఆదేశాలకు అనుగుణంగా పోలీసులు టీడీపీ నాయకులు సీమ సుధాకర్ రెడ్డితో పాటు మరో ఐదుగురిని అరెస్టు చేశారన్న విమర్శలున్నాయి. తెల్లవారుజామున 3 గంటల సమయంలో టీడీపీ నేతల ఇళ్లను పోలీసులు ముట్టడించి అరెస్టు చేసిన తీరుపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. మంత్రి బుగ్గన మాటను కాదని బయటకు వచ్చినందు వల్లనే టీడీపీ నాయకులను అరెస్టు చేశారని ప్రజల్లో చర్చ సాగుతోంది.



వైసీపీ అయితే.. నో అరెస్టు..: మంత్రి బుగ్గన సేవలో డోన్ నియోజకవర్గ పోలీసు అధికారులు ఉన్నారని చెప్పడానికి గార్లదిన్నెలో జరిగిన ఘటనే ఉదాహరణ. ఇందులో ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. వీరిలో ఆరుగురు కొత్తగా టీడీపీలో చేరినవారు ఉన్నారు. వైసీపీకి చెందిన శ్రీధర్‌రెడ్డిపై కూడా కేసు ఉంది. కానీ మంత్రి ఆదేశాల మేరకే శ్రీధర్ రెడ్డిని అరెస్టు చేయలేదన్న విమర్శలున్నాయి. ఒకే కేసులో పోలీసులు వ్యవహరించిన తీరుపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

ఎన్నికల ముందు ఎన్ని బెదిరింపులో: సార్వత్రిక ఎన్నికల ముందు డోన్ నియోజకవర్గంలో టీడీపీ నాయకులకు పోలీసుల నుంచి పెద్ద ఎత్తున బెదిరింపులు వచ్చినట్లు విమర్శలున్నాయి. మంత్రికి వ్యతిరేకంగా పని చేస్తున్నారని కోట్ల కుటుంబ సన్నిహితుడు, గుమ్మకొండ సర్పంచ్ దశరథరామిరెడ్డిని టార్గెట్ చేసి పోలీసులు పలు కేసులు నమోదు చేశారు. అదే విధంగా బావిపల్లి సర్పంచ్, టీడీపీ నాయకుడు లింగన్నపై కూడా మంత్రి బుగ్గన పోలీసులతో తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకుని వచ్చినట్లు విమర్శలున్నాయి. వైసీపీలో చేరాలని బెదిరింపులు వచ్చినా వెనక్కి తగ్గకపోవడంతో ఆయనకు సంబంధించిన మైనింగ్ గనిని మూసి వేయించినట్లు విమర్శలున్నాయి. డోన్, బేతంచెర్ల మండలాల్లోని పలువురు టీడీపీ నాయకులకు పోలీసుల నుంచి తీవ్రస్థాయిలో హెచ్చరికలు వచ్చినట్లు విమర్శలున్నాయి. అయినా టీడీపీ నాయకులు అధికార వైసీపీ అరాచకాలను తట్టుకుని నిలబడ్డారు. ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత కూడా డోన్ నియోజకవర్గంలో పోలీసులు పని చేస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



డోన్‌లో మా వాళ్ల జోలికి రావద్దంటూ పోలీసులతో వాదిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ (ఫైల్)

కూటమి విజయం ఖాయం

- టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, మే 16: ఉమ్మడి నంద్యాల, కర్నూలు నియోజకవర్గాల్లో 14 ఎమ్మెల్యే, రెండు ఎంపీ స్థానాల్లో టీడీపీ కూటమి విజయం సాధించడం ఖాయమని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన హుశేనాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓటర్లందరూ ఓపిగ్గా ఓటు వేసి మార్పు దిశగా అడుగులు వేశారన్నారు. పోలింగ్ శాతం పెరగడం, అన్ని వర్గాల ప్రజలు మార్పు కోరుకోవడంతో 14 ఎమ్మెల్యేలు, రెండు ఎంపీ స్థానాల్లో కూటమి విజయం సాధిస్తుందన్నారు. ప్రతి గ్రామం నుంచి పట్టణం వరకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు శాయశక్తులా కృషి చేశారన్నారు. వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ అరాచకాలు, దౌర్జన్యాలు, బెదిరింపులకు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పారన్నారు. ప్రజలందరూ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ చంద్రబాబును సీఎం చేయాలనే తపనతో ఓటు వేయడానికి భారీగా తరలివచ్చారని తెలిపారు. ఓటమి తప్పదని భావించి, రాష్ట్రంలో అక్కడక్కడా టీడీపీ వర్గీయులపై వైసీపీ వాళ్లు దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌బాషా, కేవీ మధు, సుధాకర్, రామగోవిందు, నాగరాజు, బజారు, వేణు, తదితరులు పాల్గొన్నారు.

హైపర్ టెన్షన్

సైలెంట్ కిల్లర్

● జీవన శైలి మార్పులతో అదుపు ● నేడు ప్రపంచ రక్తపోటు దినం



కర్నూలు(హాస్పిటల్), మే 16: హైపర్‌టెన్షన్ అంటే అధిక రక్తపోటు సమస్య. ప్రపంచ వ్యాప్తంగా హైపర్‌టెన్షన్ గురించి అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం మే 17న ఈ దినాన్ని జరుపుకుంటారు. హైపర్‌టెన్షన్‌ను సైలెంట్ కిల్లర్ అని అంటారు. రక్తనాళాలలో పీడనం చాలా ఎక్కువ ఉన్నప్పుడు (140/90 లేదా అంతకంటే ఎక్కువ) అధిక రక్తపోటు కింద లెక్కిస్తారు.

లక్షణాలు

- తలనొప్పి: తరచుగా తలనొప్పి అధిక రక్తపోటు రావడానికి ప్రారంభ హెచ్చరిక.
- దృష్టిలో సమస్యలు: దీర్ఘకాలికంగా బీపీ ఉంటే కళ్లలోని రక్తనాళాలు దెబ్బతింటాయి. అధిక రక్తపోటు రెటీనాకు నష్టం కలిగిస్తుంది. దీనిని రెటినోపతి అంటారు.
- శ్వాస ఆడకపోవడం: అ.ధిక రక్తపోటు గుండెపై ఒత్తిడికి దారి తీస్తుంది. గుండెకు రక్తం సరిగ్గా సరఫరా కాక శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని కలిగిస్తుంది.
- అలసట: తీవ్రమైన అలసట అధిక రక్తపోటుకు సంకేతం. రక్తపోటు రక్తాన్ని సమర్థవంతంగా పంప్ చేసేందుకు గుండె కష్టపడాల్సి వస్తుంది. దీని వల్ల మెదడు ఇతర ముఖ్యమైన అవయవాలకు ఆక్సిజన్, పోషక సరఫరాను తగ్గిస్తుంది.
- కిడ్నీల పనితీరు తగ్గడం : అధిక రక్తపోటు వల్ల కిడ్నీల పనితీరును నిశ్శబ్దంగా దెబ్బ తీస్తుంది.
- బీపీని కంట్రోల్ చేసుకోండి ఇలా:
- ఆహారంలో ఉప్పును బాగా తగ్గించాలి.
- నవడవడం వల్ల హైబీపీ సమస్యను తగ్గించవచ్చు.
- ఆల్కహాల్, స్మోకింగ్ అలవాటు ఉన్నవారు మానేస్తే హైబీపీ తగ్గుతుంది.
- వీలైనంత వరకు ప్రశాంతంగా ఉండాలి.
- బరువు తగ్గితే బీపీ అదుపులోకి వస్తుంది.
- రెగ్యులర్‌గా మెగా మెడిటేషన్ చేస్తే బీపీ తగ్గుతుంది.



ఉప్పును తగ్గించాలి



అధిక రక్తపోటు వారసత్వంగా కూడా ఇది వస్తుంది. అలాగే చెడు జీవనశైలి కారణంగా కూడా హైబీపీ వస్తుంది. ఆహారంలో రోజు 5 గ్రాముల ఉప్పు కంటే ఎక్కువ తినకూడదు.

- డా.ఎన్.చైతన్యకుమార్, కార్డియాలజిస్టు, కర్నూలు మెడికవర్ హాస్పిటల్

రక్తపోటును నియంత్రించవచ్చు



రక్తపోటును నియంత్రించుకోవచ్చు. లేకపోతే అధిక రక్తపోటు హార్ట్ స్ట్రోక్‌కు ప్రధాన కారణమవుతుంది. నిద్రలేకపోవడం, ధూమపానం, తక్కువ శారీరక శ్రమ వల్ల బీపీ సంభవించే అవకాశాలున్నాయి.

- నాగేంద్ర కుమార్, కార్డియాలజిస్టు, కిమ్స్ హాస్పిటల్, కర్నూలు

డిగ్రీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయండి

సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో వీసీ తనిఖీలు



శంకరాస్ డిగ్రీ కళాశాలలో పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఉపకులపతి

కర్నూలు(అర్బన్), మే 16: డిగ్రీ 2,4,6 సెమిస్టర్ పరీక్షల్లో ఎలాంటి లోటు పాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఉపకులపతి బి. సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 61 పరీక్షా కేంద్రాల్లో 3,374 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. నగరంలోని శంకరాస్ డిగ్రీ కళాశాల, సెయింట్ జోసెఫ్ మహిళా డిగ్రీ కళాశాలలో రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల నిర్వాహణ తీరును పరిశీలించారు. అదే విధంగా ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ప్రారంభమైన ఏపీఈఏపీ సెట్ పరీక్షా కేంద్రాలను వీసీ పరిశీలించారు. జి.పుల్లా రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలల్లో ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న ప్రవేశ పరీక్ష తీరును పరిశీలించారు. ఆయన వెంట రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ తదితరులు ఉన్నారు.

కౌంటింగ్ విధులకు సచివాలయ సిబ్బంది

జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి



కర్నూలు(న్యూసిటీ), మే 16: జూన్ 4న నిర్వహించనున్న ఎన్నికల కౌంటింగ్‌కు సచివాలయ సిబ్బంది సేవలు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి తెలిపారు. గురువారం జిల్లా పరిషత్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్‌లో ఎన్నికల సిబ్బందికి సహాయ సహకారాలు అందించేందుకు సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారన్నారు. ఈ మేరకు ఓర్వకల్లు, కల్లూరు, కర్నూలు రూరల్ మండలాల నుంచి సచివాలయ సిబ్బందిని ఎంపిక చేసి మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ ట్రజరీస్‌కు నివేదికలు పంపాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలిపారు. సుమారు 450 సచివాలయ సిబ్బంది సేవలను కౌంటింగ్‌లో ఉపయోగించుకోనున్నట్లు ఆయన తెలిపారు.

కొత్తపల్లి మండలంలో భారీ వర్షం

ఎదురుపాడులో నేలకొరిగిన భారీ వృక్షాలు



ఎదురుపాడులో నేలకొరిగిన వృక్షాలు

కొత్తపల్లి, మే 16: కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో కూడిన ఓ మోస్తరు భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా ఎదురుపాడు, కొక్కెరంచ, నాగంపల్లి, జడ్‌వారిపల్లి గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం పడగా.. వివిధ గ్రామాల్లో ఈదురుగాలులతో తుంపర్లతో కూడిన వర్షం పడింది. మండు వేసవిలో ఎండ వేడిమిని తాళలేక ఇబ్బందులు పడిన వృద్ధులు, చిన్నారులకు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. రైతులు దుక్కులు దున్నడం ఆరంభించారు. ఎదురుపాడులో పెనుగాలుల భీభత్సానికి భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో గ్రామస్థుల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

అరటికి అగ్నిప్రమాదం

3ఎకరాల్లో దెబ్బతిన్న పంట

ప్యాపిలి, మే 16: మండలంలోని గార్లదిన్నె గ్రామంలో బుధవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 3ఎకరాల్లో అరటి పంట కాలిపోయి రూ.3లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన శివవెంకటరామిరెడ్డి ఎకరాకు రూ.లక్ష చొప్పున పెట్టు బడులు పెట్టి మూడు ఎకరాల్లో అరటి సాగు చేశారు. పంట చేతి కొచ్చింది. అయితే బుధవారం అర్ధరాత్రి ట్రాన్స్‌ఫారంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. మంటలు అరటి తోటకు వ్యాపించాయి. దీంతో మంటలకు అరటి చెట్లు, కాయలు కాలిబూడిదయ్యాయి. అలాగే పొలంలోని డ్రిప్ పైపులు కాలిపోయాయి. రైతు శివవెంకటరామిరెడ్డికి రూ.3లక్షలు నష్టం వాటిల్లింది. అప్పులు చేసి పంటను సాగు చేశానని, అగ్ని ప్రమాదంలో పంట పూర్తిగా నాశనమైందని రైతు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ఠ భద్రత



స్ట్రాంగ్‌రూంలలోని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, ఎస్పీ

నంద్యాల క్రైం/పాణ్యం, మే 16 : పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎం యంత్రాల కోసం ఆర్జీఎం, శాంతిరామ్ ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ఠభద్రత ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గురువారం వారు ఆర్జీఎం, శాంతిరామ్ ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతా సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. కేంద్ర పోలీస్ బలగాల గార్డులు, జిల్లా ఆర్మడ్ పోలీస్ గార్డులు, సివిల్ పోలీసు సిబ్బంది కౌంటింగ్ వరకు అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. భద్రతా చర్యల్లో ఎలాంటి అలసత్వం ఉండరాదని హెచ్చరించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల పరిసర ప్రాంతాల్లో 144వ సెక్షన్ అమల్లో ఉంటుందని, నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీస్ పహారా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డీఎస్పీ స్థాయి అధికారి 24 గంటలపాటు భద్రతను పర్యవేక్షిస్తుంటారన్నారు. ఎలాంటి అగ్నిప్రమాదాలు సంభవించకుండా ఫైర్ ఇంజన్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లు తెరిచేముందు, మూసే సమయంలో సీసీటీవీ కెమెరాల్లో సీల్ కనిపించే విధంగా ఏర్పాటు చేశామన్నారు. సీసీ పుటేజీలు అన్ని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయబడి 24గంటలు సిబ్బంది పర్యవేక్షిస్తూ ఉండేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జిల్లా వ్యాప్తంగా పోలీస్ పికెట్లు, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. అసాంఘిక శక్తులు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అపోహలు, తప్పుడు సమాచారాలు నమ్మి ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే పోలీసు శాఖ తీవ్రంగా పరిగణించి అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటుందని ఎస్పీ హెచ్చరించారు.

కౌంటింగ్‌కు సిద్ధం చేసుకోండి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), మే 16: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అవసరమైన ఏర్పాటు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ వచ్చేనెల 4వ తేదీన ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్ కాలేజీలలో నిర్వహించే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాల మేరకు కౌటింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ప్రతి కౌటింగ్ టేబుల్ వద్ద సూపర్‌వైజర్, అసిస్టెంట్ సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉండాలని, దీనికి 760 మంది సిబ్బంది అవసరం అవుతారని అన్నారు. ఆ మేరకు మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిని, క్యూ ఆర్ కోడ్ రీడర్, పిజియోన్ హోల్, డ్రమ్స్, వివి ప్యాడ్ పిజియోన్ హోల్ తదితర స్టేషనరీ సామాగ్రిని సమకూర్చాలని మెటీ రియల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిని, కౌటింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు మెటీరియల్‌ను సిద్ధం చేసుకోవాలని ట్రైనింగ్ నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాతనే ఈవీఎంల లెక్కింపు ప్రారంభించాలన్నారు. అన్ని పార్టీల ఏజంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ పద్మజ, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల, సంబంధిత నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

24 గంటలు పటిష్ఠ భద్రత

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్



సూచనలు ఇస్తున్న కలెక్టర్ డా.జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), మే 16: స్ట్రాంగ్ రూముల వద్ద నియమించిన పోలీసు బలగాలు పటిష్ఠభద్రత అందించేందుకు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన పేర్కొన్నారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ బ్లాకులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో 8 అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎం యంత్రాలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లకు ఉన్న సీసీ కెమెరాల లైవ్ ఫీడ్‌ను జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్, పాణ్యం ఆర్వో నారపురెడ్డి మౌర్యతో కలిసి పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లో స్ట్రాంగ్ రూమ్‌లు 24 గంటలు స్క్రీన్‌లలో డిస్‌ప్లే అవుతూ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్‌కు షిఫ్టుల ప్రకారం నియమించిన రెవెన్యూ సిబ్బంది వివరాలను పోలీసు అధికారులకు అందజేయాలని డీఆర్వోను ఆదేశించారు. రాయలసీమ యూనివర్సిటీ స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత దృష్ట్యా విధులు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు, ఆర్మడ్ రిజర్వ్ పోలీసు, స్థానిక పోలీసులకు తాగునీరు, భోజన ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని డీఆర్వో, టిడ్కో ఎస్‌ఈలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో మధుసూదన్‌రావు, కుడా వైస్ చైర్మన్ వెబ్ కాస్టింగ్ నోడల్ అధికారి ప్రతాప్ రెడ్డి, టిడ్కో ఎస్‌ఈ రాజశేఖర్, ఎమ్మిగనూరు ఆర్వో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలంతా చంద్రబాబు వెంటే..

● రాష్ట్ర అభివృద్ధి కోసమే ఎన్డీఏతో పొత్తు

● ముస్లిం మైనార్టీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

కర్నూలు(అర్బన్), మే 16: కుల, మతాలకు అతీతంగా పనిచేసే చంద్రబాబు నాయుడు లౌకికవాది అని, ముస్లింలందరూ ఆయన వెంటే ఉన్నారని మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. అబ్దుల్ రజాక్ అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీఏతో పొత్తుపెట్టుకున్న చంద్రబాబు ముస్లిం సమాజానికి ఎంతో సేవ చేశారని గుర్తుచేశారు. కూటమి ఆధ్వర్యంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకుంటారన్నారు. ఒక కన్ను ముస్లింలు, మరో కన్ను హిందువుల్లా చంద్రబాబు గతంలో పాలన కొనసాగించారని కొనియాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు మల్లెల పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో పోలీసు బలగాల మోహరింపు

పట్టణంలో 144 సెక్షన్ అమలు

ఆళ్లగడ్డ, మే 16: ఆళ్లగడ్డలో మాజీ మంత్రి అఖిలప్రియ బాడీ గార్డ్ నిఖిల్‌పై జరిగిన హత్యాయత్నం కేసును దృష్టిలో ఉంచుకొని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీసు బలగాలను మోహరించాయి. ఆళ్లగడ్డ పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు పోలీసు బలగాలను ఎస్పీ రఘువీర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు మోహరింపజేసినట్లు ఆళ్లగడ్డ డిఎస్పీ షర్ఫుద్దీన్ గురువారం చెప్పారు. ఆళ్లగడ్డ పోలీసు సబ్ డివిజన్‌లోని ముగ్గురు సీఐలు, ఎస్‌ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులను రప్పించామన్నారు. పట్టణంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని అన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద పోలీసు బలగాలను ఏర్పాటు చేశామన్నారు.

పెరిగిన పోలింగ్ కూటమి విజయానికి సంకేతం

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు(అర్బన్), మే 16: రాష్ట్రంలో గణనీయంగా పెరిగిన పోలింగ్ ఎన్డీయే కూటమి విజయానికి సంకేతమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం.ప్రజలు ఓటు వేయడం వల్లే పోలింగ్ శాతం పెరిగిందన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమిశెట్టి మాట్లాడారు. జగన్‌ను ఇంటికి పంపాలనే కసితో ప్రజలు టీడీపీకి ఓటు వేశారన్నారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన నీచుడిని, అయనను ఇంటికి పంపేందుకు ప్రజలు టీడీపీకి ఓటు వేశారన్నారు. ఓటింగ్ రోజు వర్షాన్ని కూడా లెక్క చేయకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారన్నారు. కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయనా పాలనలో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాని తెలిపారు. దేశ, విదేశాలు, నగరాలను, పట్టణాల నుంచి స్వస్థలాలకు చేరుకుని ఓటు వేయడం అంటే రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకున్నారని, జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సర్వనాశనమవ్వడమే కాక, అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమన్నారు. మార్చి నాలుగోతేదీ తర్వాత ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు కావడం తథ్యమని సోమిశెట్టి పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

● ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం

● పీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్



సమావేశంలో మాట్లాడుతున్న శైలజానాథ్

కర్నూలు(అర్బన్), మే 16: రాష్ట్రంలో కొన్ని రాజకీయ పార్టీలు అధికారం కోసం డబ్బును వరదలా పారించాయని పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీసీ కే.బాబురావుతో కలిసి ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందని ధ్వజమెత్తారు. ఎన్నికల తీరు మారాలని, రాష్ట్రంలో జరిగిన పోలింగ్ తీరుపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి కేంద్రంలో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో షర్మిల నాయకత్వంలో పని చేయడానికి ఎందరో నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు బాబురావు మాట్లాడుతూ టీడీపీ, వైసీపీలు బీజేపీ చేతిలో కీలుబొమ్మలని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, ఉండవల్లి వెంకటన్న, అశోకరత్నం మాదిగ, బ్రతుకన్న, బీ.రామాంజనేయులు, లాజర్, షేక్ ఖాజా హుస్సేన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో ప్రబలిన అతిసార

బండిఆత్మకూరు, మే16: మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో 15 మందికి వాంతులు, విరోచనాలు అయ్యాయి. గురువారం ఉదయాన్నే నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి 11 మందిని బంధువుల తరలించారు. గ్రామానికి చెందిన నాయుడు, సుబ్బరాయుడు, ఉశ్శేనమ్మ, వెంకటస్వామి, సాయిబీ, తులశమ్మ, పెద్దకాశీం, సుంకేశ్వరమ్మ, హుస్సేన్, దేవభూషి, సుబ్బరాయుడు, లక్ష్మిదేవి, మద్దమ్మ, మద్దిలేటి, రంగమ్మలను అతిసారతో ఆసపత్రుల్లో చేరారు. డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మనోహర్, డీఈ శ్రీనివాసులు, ఏఈ లక్ష్మీనరసింహ, ఈవోఆర్డీ శ్రీనివాసులు గ్రామానికి చేరుకొని వాంతులు, విరేచనాలు కావటానికి గల కారణాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. నీటి నమూనాలు తీసుకున్నారు. హోటళ్లలో పదార్థాలపై వాకబు చేశారు. స్థానికంగా మంచి నీటి సరఫరా నిలిపి వేసి, బయటి గ్రామాల నుంచి సరఫరాకు అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక వైద్యాధికారి డాక్టర్ భావన, సిబ్బందితో వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు.

అక్రమంగా ఇసుక తవ్వితే చర్యలు



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న గనుల శాఖ అధికారులు

కర్నూలు(అర్బన్), మే 16: అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం సీ. బెళగల్ మండలం కే సింగవరం వద్ద అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కడ తవ్వకాల కోసం ఉంచిన వాహనాలు, తదితర సామగ్రిని యజమానులు అక్కడి నుంచి తరలించాలని ఆదేశించామన్నారు. ప్రస్తుతం తవ్వకాలు జరిగడం లేదని, ఎవరైనా తవ్వకాలను పాల్పడితే చర్యల తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట విజిలెన్స్ ఏడీ భైరాగి నాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పులకించిన పులకుర్తి

● ఘనంగా సాయినాథుడి రథోత్సవం

● వేలాదిగా తరలివచ్చిన భక్తులు

సాయినామస్మరణతో కోడుమూరు మండలంలోని పులకుర్తి గ్రామం పులకించింది. సద్గురు సాయిబాబా రథోత్సవాన్ని గురువారం సాయంత్రం రథోత్సవం గ్రామంలో కన్నులపండువగా సాగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు, హారతులు నిర్వహించారు. సాయంత్రం సాయినాథుడి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాల నడుమ తీసుకొచ్చి సుందరంగా ముస్తాబు చేసిన రథంపై కొలువుదీర్చారు. అనంతరం టెంకాయలు, గుమ్మడి కాయలు సమర్పించి సాత్విక బలిదానం చేశారు. భక్తులు సాయినామస్మరణ చేస్తూ రథాన్ని లాగడానికి యువకులు, భక్తులు పోటీపడ్డారు. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఆలయంలో కర్నూలు స్పెషల్ పోలీసు డీఎస్పీ మహబూబ్ బాష పూజలు నిర్వహించారు. పూజారులు డీఎస్పీని సత్కరించారు.

- కోడుమూరు రూరల్



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

'అనుమతి ఉన్న విత్తనాలే విక్రయించాలి'



తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

నంద్యాల టౌన్, మే 16: అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని వ్యవసాయ శాఖ నంద్యాల ఏడీఏ డి.రాజశేఖర్ ఆదేశించారు. గురువారం ఏడీఏ ఆధ్వర్యంలో ఏవో ప్రసాదరావు, సిబ్బంది పలు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాలకు సంబంధించి వివరాలు, నిల్వకు సంబంధించిన వివరాలను తనిఖీలు చేశారు. విత్తన నాణ్యత ప్రమాణాలు తెలుసుకోవడానికి సాయి ఆగ్రో ఏజెన్సీస్ దుకాణం నుంచి 5 పత్తి విత్తన నమూనాలను, వెంకటేశ్వర సీడ్స్ నుంచి 5 పత్తి విత్తన నమూనాలను తీసుకొని ల్యాబ్‌కు పంపారు. హెచ్‌టీ టెస్ట్ నిర్వహించగా నెగిటివ్‌గా నిర్ధారించడం జరిగినట్లు ఏడీఏ తెలిపారు. అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని, సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని దుకాణాదారులను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని ఏడీఏ హెచ్చరించారు.

చర్చిలో చోరీ

పాణ్యం, మే 16: మండలంలోని తమ్మరాజుపల్లెలోని యెరుసలేం చర్చిలో చోరీ జరిగినట్లు చర్చి సంఘం పెద్దలు నాగరాజు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చర్చి తాళం పగలగొట్టి రెండు మౌత్ పీస్‌లు, రెండు బియ్యం బస్తాలు, హుండీ నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. గురువారం ఉదయం చర్చి వద్దకు వెళ్లిన సంఘంపెద్దలు తలుపు తెరచి ఉండడంతో అనుమానం వచ్చి చోరీ జరిగినట్లు గుర్తించడంతో పాణ్యం పోలీసులకు సమాచారం తెలిపామన్నారు. ఈమేరకు పాణ్యం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం సంఘ పెద్దలు పాణ్యం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ తమకు ఫిర్యాదు అందిందని, విచారిస్తున్నామని చెప్పారు.

'తాగునీటి సమస్య తీర్చండి'

ఆత్మకూరు, మే 16: ఆత్మకూరు పట్టణంలోని రహమత్‌నగర్ ఏరియాలో తాగునీటి సమస్యను తీర్చాలని కాలనీవాసులు గురువారం మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రహమత్‌నగర్‌లోని పలు కాలనీలకు రెండువారాలకు ఓసారి నీటి సరఫరా జరుగుతోందని అన్నారు. పైగా వచ్చేనీరు కూడా తక్కువగా రావడంతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. దీంతో నీటికోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి అవస్థలు పడుతున్నామని వాపోయారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ మాట్లాడుతూ.. రహమత్‌నగర్‌లోని అన్ని కాలనీలకు పుష్కలంగా తాగునీటి సరఫరా జరిగేలా చూస్తామని అన్నారు. ప్రత్యేకించి ఎక్కడైనా పైపులైన్‌లో అడ్డంకులు ఉన్నాయా..? అని పరిశీలిస్తామని తెలిపారు. వీలైనంత త్వరగా తాగునీటి సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చారు. అలాగే తాగునీటి సమస్యను మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్ దృష్టికి తీసుకెళ్లారు.

సరైన గౌరవ వేతనం చెల్లించాలి: ఏపీటీఎఫ్

నంద్యాల (నూనెపల్లె), మే 16: ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన పోలింగ్ సిబ్బందికి సరైన విధంగా గౌరవ వేతనం చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా పీవో, ఏపీవో లకు ఆరు రోజులకు, ఓపీవోలకు నాలుగు రోజులకు గౌరవ వేతనం చెల్లించాల్సి ఉండగా నియోజకవర్గ ఆర్వోలు సరైన విధంగా గౌరవ వేతనం చెలించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పోలింగ్ సిబ్బందికి గౌరవ వేతనం సరైన విధంగా చెల్లిస్తున్నారని, అలాగే నంద్యాల జిల్లాలో కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జయరాం, జిల్లా ప్రధాన కార్యర్శి సాంబ శివుడు , జిల్లా కార్యదర్శులు పుల్లయ్య, మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలం, మే 16: శ్రీశైలం మహాక్షేత్రంలో గురువారం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని దత్తాత్రేయ స్వామివారికి లోకకల్యాణం కోసం విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహా గణపతి పూజలు చేసి, అనంతరం దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు జరిపారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో గురువారం రంగారెడ్డి చెందిన వి. రాధిక బృందం సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయక కౌత్వం, శివాష్టకం, శివపంచాక్షరి, శివలీలలు, ఓం నమఃశివాయ తదితర గీతాలకురాధిక, రేవతి, కార్తికేయ, సిద్ధార్థ చంద్ర, వంశిక, శిరిష, సహస్ర, కీర్తిక, అక్షిత తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న యూత్ సభ్యులు

పాములపాడు, మే 16: మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో అగ్ని ప్రమాదంలో గుడిసె కాలిపోయిన బాధిత కుటుంబానికి శివసేన యూత్ రూ.19 వేలు ఆర్థిక సాయాన్ని అందించింది. గ్రామంలోని నాగశేషులుకు చెందిన గుడిసె మంగళవారం కాలిపోవడంతో కట్టుబట్టలతో బయటపడ్డారు. దీంతో బాధిత కుటుంబాన్ని చేయూతనందించారు. కొందరు ధన సాయం, బియ్యం, సామగ్రిని అందించారు.

డెంగీ నివారణపై అవగాహన

మిడుతూరు, మే 16: మిడుతూరు గ్రామంలో కడుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ రాజు ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవం సదర్భంగా డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ 18 సంవత్సరాల నుంచి 99 సంవత్సరాల వయస్సు గల వారు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. షుగరు, బీపీ, పొగ తాగువారు, ఓల్డు టీబీ పేషంట్ కుటుంబ సభ్యులు బీఎంఐ 18 కంటే తక్కువ ఉన్నవారు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు ఏసేపు, రామ తులసమ్మ, ఏఎన్ఎంలు సుగుణమ్మ, జ్యోతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మహానంది: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మహానంది మండలం ఎం.తిమ్మాపురం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భగవాన్‌దాస్ తెలిపారు. జాతీయ డెంగీ వ్యాది దినోత్సవం పురష్కరించుకొని గురువారం మహానంది మండలం తిమ్మాపురంలో వైద్యాధికారి ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దోమకాటుకు గురికాకుండా తెరలు ఉపయోగించాలని సూచించారు. డెంగీ నివారణపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఈవో ఉసేన్‌రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మిడుతూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

క్షయవ్యాధి నిర్మూలనకు టీకా

కొత్తపల్లి, మే 16: కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గువ్వలకుంట్ల, కొత్తపల్లి, నందికుంట, దుద్యాల సెంటర్లలో క్షయ వ్యాధి నిర్మూలనకు టీకాను వైద్యాధికారి దీపా నాగవేణి ఆధ్వర్యంలో వేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డీసీజీ సర్వే అనంతరం అర్హులైన వారికి టీకాను గురువారం నుంచి ప్రారంభించినట్లు వైద్యాధికారి చెప్పారు. ఈ టీకాను ప్రతి గురువారం మాత్రమే వేస్తారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బాలకృష్ణ, పీహెచ్ఎన్ ఆయేషా బేగం, టీబీ సూపర్‌వైజర్లు రవికుమార్, గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: క్షయ వ్యాధి నివారణకు ప్రతి గురువారం ఈసీజీ వ్యాక్సిన్‌లు వేస్తున్నట్లు ఏఎన్ఎం దరగమ్మ తెలిపారు. గురువారం వెలుగోడు మండలంలోని ఆయా సచివాలయాల పరిధిలో వ్యాక్సినేషన్ వేశారు. 18 ఏళ్ళు పై పడిన వారు ఆస్తు చివరి వరకు ప్రతి గురువారం ఈ టీకా వేయనున్నట్లు తెలిపారు.



వెలుగోడు: టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

వెలుగోడు పట్టణంలో 70 మందికి ఈ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గీత, ఆశావర్కర్లు తులసి, అంకమ్మ, రేఖ, స్వర్ణలత పాల్గొన్నారు.

వెదుర్లు స్వాధీనం



వెదుర్లు, సైకిళ్లను స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

బండిఆత్మకూరు, మే 16: మండలంలోని నారపురెడ్డికుంట సెక్షన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో అక్రమంగా తరలిస్తున్న వెదర్లను స్వాధీనం చేసుకున్నట్లు రేంజ్ ఆఫీసర్ నజీర్‌రూా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ నారపురెడ్డికుంట సెక్షన్ పరిధిలోని బాలయ్యకుంట, మలపుల చెరువు ప్రాంతాలలో 16 సైకిళ్లపై అక్రమంగా తరలిస్తున్న సుమారు 500 వెదురు బొంగులను డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగేంద్రనాయక్, ఎఫ్ఎస్‌వోలు వెంకటసుబ్బయ్య, రవీంద్రనాయక్, తేజ, సిబ్బందితో దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. స్వాధీనం చేసుకున్న సైకిళ్ళను, వెదుర్లను బండిఆత్మకూరు రేంజ్ కార్యాలయానికి తరలించామని చెప్పారు. అనుమతి లేకుండా ఎవరూ అడవిలోకి వెళ్లకూడదని ఎఫ్ఆర్వో ఆదేశించారు.

ఇరువర్గాల ఘర్షణ.. 10 మందిపై కేసు

మహానంది, మే 16: మండలంలోని గోపవరం గ్రామంలో ఉపాధిహామీ పనుల్లో గురువారం ఇరువర్గాలపై ఘర్షణ పడినట్లు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. దీనిపై ఇరువర్గాలకు చెందిన 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గ్రామంలో టీడీపీకి అనుకూలంగా వ్యవహరించారన్న నెపంతో కొందరు ఉపాధి పనులకు వెళ్లిన తనపై దాడి మహిళలు మూకుమ్మడిగా దాడి చేశారని చింతం రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. గోపవరం సమీపంలోని భైరవాణి చెరువు పరిసరాల్లో ఉపాధి హామీ పనుల కోసం టీడీపీ సానుకూలపరులు చింతం రమేష్, ఆయన భార్య శారద, మేనత్త పుల్లమ్మ తదితరులు కలిసి వెళ్లారు. కొద్దిసేపు తర్వాత అల్పాహారం తినేందు కోసం బైక్‌పై గ్రామం లోకి వెళ్తుంటే అదే గ్రామానికి చెందిన కాగుల క్రాంతికుమార్, కాగుల నరసింహ, కాగుల బాబు, మల్లెల తులశమ్మ, అంజనమ్మ, సరోజ,రాములమ్మ మరికొందరు కలిసి అడ్డగించారన్నారు. టీడీపీకి అనుకూలంగా ఉంటారా? ఇప్పుడు దొరికారు రా మీరు అంటూ తనపై గొడ్డలితో దాడి చేయడంతో గాయాలపాలైనట్లు బాధితుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. తనపై దాడి జరుగుతుందని గ్రహించి తన భార్యతో పాటు తన మేనత్త పుల్లమ్మ పరుగెత్తుకుంటూ వచ్చారని చెప్పారు. తనను వదిలేసి మహిళలు మట్టి గడ్డలతో తన భార్యతో పాటు మేనత్త పుల్లమ్మలపై దాడి చేశారని చెప్పారు. అలాగే తమపై కొడవలితో చింతం రమేష్‌తో పాటు ఆయన భార్య, మేనత్త పుల్లమ్మలు దాడి చేసారని మహిళలు మహానంది పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై ఎస్ఐ నాగేంద్రప్రసాద్ విచారించారు. ఇరువర్గాలకు చెందిన 10 మందిపై కేసు నమోదుదర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నల్లమలలో యువకుడి మిస్సింగ్

- సీఐ ఆధ్వర్యంలో డ్రోన్‌లతో ఆచూకీ కోసం గాలింపు
- క్షేమంగా ఇంటికి చేరుకోవడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు

ఆత్మకూరురూరల్, మే 16: ఆత్మకూరు మండల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఓ యువకుడు అదృశ్యమై మరుసటిరోజు ప్రత్యక్షమయ్యాడు. అదృశ్యమైన యువకుడి కోసం పోలీసులు డ్రోన్ కెమెరాలతో నల్లమలలో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే మరుసటిరోజు ఆ యువకుడు ఇంటికి క్షేమంగా చేరుకోవడంతో అటు పోలీసులు, ఇటు కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలివీ.. మండలంలోని ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, ఆంజనేయులు కుమారుడు తరుణ్ అనే యువకుడి వివాహం త్వరలో జరుగనుంది. ఈ మేరకు తరుణ్ 8 మంది గ్రామస్థులతో కలిసి బుధవారం వివాహానికి కావాల్సిన కట్టెల కోసం రెండు ఎద్దుల బండ్లతో గ్రామ శివార్లలోని నల్లమల అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. కట్టెలు కొట్టుకుని రాత్రి వారు తిరుగు పయనమయ్యారు. అయితే మార్గమధ్యంలో తరుణ్ బహిర్భూమికి వెళ్లి వస్తానని మిగతావారిని వెళ్లాలని చెప్పి బండి దిగి వెళ్లారు. కాసేపటి తర్వాత అతను దారి తప్పి సహచరులకు ఫోన్ చేశాడు. ఫోన్‌లో ఛార్జింగ్ అయి పోవడంతో సహచరులు వచ్చి వెతికినా అతని ఆచూకీ లభించలేదు. దీంతో సహచరులు గ్రామం చేరుకుని విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. గురువారం ఉదయం కూడా తరుణ్ ఇంటికి రాకపోడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది 100కు ఫోన్ చేసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఆత్మకూరు సీఐ లక్ష్మీనారాయణ డ్రోన్ కెమెరాలతో, గ్రామస్థులను వెంట బెట్టుకుని నల్లమలలో గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా తరుణ్ అటవీ ప్రాంతం నుంచి గురువారం మధ్యాహ్నం క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు గాలింపు చర్యలు ఆపి వెనుదిరిగారు తరుణ్ క్షేమంగా ఇంటికి చేరుకోవడంతో ఇటు కుటుంబ సభ్యులు అటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

లోయలో మినీ ట్రక్ బోల్తా

- నల్లమల ఘూట్‌లో ప్రమాదం ● 15 మందికి తీవ్రగాయాలు



లోయలో బోల్తా పడిన వాహనం

పెద్ద దోర్నాల, మే 16: వేగం అదుపుతప్పిన మినీ ట్రక్ లోయలో బోల్తా పడి పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం నల్లమల అటవీ ప్రాంతం శ్రీశైలం-దోర్నాల ఘాట్‌రోడ్డులో చిన్నారుట్ల మూలమలుపు వద్ద చోటుచేసుకొంది. కర్నూలు జిల్లా కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన 15 మందికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిసిన కథనం ప్రకారం.. కోడుమూరు మండలం నుంచి మినీ ట్రక్‌లో 25 మంది శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనార్థం వెళుతున్నారు. చిన్నారుట్ల మూలమలుపు వద్ద వేగం అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొట్టి లోయలోకి దూసుకుపోయింది. చెట్టుకు తాకడంతో బోల్తా పడింది. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. అదృష్టవశాత్తు లోయలోకి పూర్తిగా పోకుండా చెట్టు నిలువరించింది. దీంతో ప్రాణనష్టం జరగలేదు. వెంటనే 108 అంబులెన్స్ వాహనానికి సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను దగ్గరలోని సుండిపెంట వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు.

శాశ్వత అన్నదాన పథకానికి విరాళం



స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న పర్యవేక్షకురాలు



స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న పర్యవేక్షకుడు

శ్రీశైలం, మే 16: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన వీకే అశ్విన్ అనే భక్తుడు కుటుంబ సమేతంగా కలిసి రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. దాత ఈ విరాళాన్ని దేవస్థానం పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు. అలాగే వికారాబాద్‌కు చెందిన అరుణ మనోహర్‌రెడ్డి అనే భక్తుడు రూ. 1,01,116 విరాళాన్ని పర్యవేక్షకుడు గంజి రవికి అందజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

కంపచెట్ల మధ్య దళితుల శ్మశానం



ఎస్.కొత్తూరులో కంపచెట్లతో నిండిన దళితుల శ్మశానం

పాణ్యం, మే 16: సుబ్బరాయుని కొత్తూరు గ్రామంలో దళితులకు కేటాయించిన శ్మశాన స్థలం కంపచెట్లతో దర్శనమిస్తోంది. అంత్యక్రియలు నిర్వహించడానికి దళితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో శ్మశానాన్ని అభివృద్ధి చేస్తామంటూ హామీలిచ్చారే తప్ప అమలుకు నోచుకోలేదని దళితులు వాపోతున్నారు. టీడీపీ హయాంలో మండలంలోని నెరవాడ, పాణ్యం, కౌలూరు గ్రామాలలో శ్మశానాల్లో తాగునీరు, దుస్తులు మార్చుకొను గది, ప్రహరీ కోసం ఉపాధి హామీ పథకం కింద దాదాపు రూ.30 లక్షల నిధులు కేటాయించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ.. శ్మశానాల అభివృద్ధికి పైసా నిధులు కేటాయించలేదు. దీంతో శ్మశానాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పైగా కంపచెట్లు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. ప్రభుత్వం కేటాయించిన 35 సెంట్లలో మృత దేహాలను పూడ్చుతున్నారు. మృతదేహాలను పూడ్చివేసే సమయంలో శ్మశానంలోని కంపచెట్లు తొలగించుకోవాల్సి దుస్థితి ఉందన్నారు. ప్రభుత్వం శ్మశానాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

శ్మశానాన్ని అభివృద్ధి చేయాలి



ఎన్నో ఏళ్లుగా గ్రామంలోని దళితులకు అనువైన శ్మశానం లేదు. దళితులకు కేటాయించిన శ్మశాన స్థలంలో కంపచెట్లు పెరిగి మృతదేహాలను పూడ్చుకోవాలంటే కంప చెట్లు తొలగించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో శ్మశానం అభివృద్ధికి ఉపాధి నిధులు కేటాయించామన్న అధికారులు ఇంత వరకు పనులు చేపట్టలేదు. శ్మశాన స్థలాన్ని సర్వే చేసి ప్రహరీ, తాగునీటి బోరు, దుస్తులు మార్చుకొనే గదులను నిర్మించాలి.

- వెంకటసుబ్బయ్య, ఎస్.కొత్తూరు

'గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి'

పగిడ్యాల, మే 16: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పగిడ్యాల గ్రంథాలయ అధికారిణి మద్దమ్మ సూచించారు. పగిడ్యాల గ్రథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు వేసవిలో చదువుతో పాటు ఆటలతో కూడిన బోధన అందజేస్తున్నట్లు తెలిపారు.

'అవకతవకలకు పాల్పడితే చర్యలు'



పెట్రోల్ బంకును తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారి జిలానీబాషా

గడివేముల, మే 16: పెట్రోలు బంకుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారి జిలానీబాషా హెచ్చరించారు. మండల కేంద్రంలోని పెట్రోలు బంకుల్లో గురువారం ఆయన తనిఖీలు చేపట్టారు. కొలతలను పరిశీలించారు. పెట్రోలు బంకుల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. అధిక రేట్లకు విక్రయిం చినా, నాణ్యత లేని పెట్రోల్, డీజిల్ విక్రయించినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఏపీఈఏపీ సెట్ ప్రారంభం

నంద్యాల (నూనెపల్లె), మే 16: రాష్ట్రంలోని ఇంజినీరింగ్ అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఏపీఈఏపీ సెట్-2024 గురువారం నుంచి ప్రారంభమైంది. జిల్లాలో రామకృష్ణ డిగ్రీ కళాశాల, రామకృష్ణ పీజీ కళాశాల, ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. గురువారం, శుక్రవారం బైపీసీ స్ట్రీమ్, 18 నుంచి 23 వరకు ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 9 గంటలనుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి 5.30 గంటల వరకు గురువారం పరీక్ష జరిగింది. అభ్యర్థులకు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు గంట ముందే చేరుకున్నారు. మొదటి రోజు జరిగిన పరీక్షకు రామకృష్ణ డిగ్రీ కళాశాల కేంద్రంలో 191 మంది విద్యార్థులు హాజరు కాగా 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రామకృష్ణ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 339 మంది విద్యార్థులకు గాను 313 మంది విద్యార్థులు హాజరు కాగా 26 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 718 మంది విద్యార్థులకు గాను 687 మంది విద్యార్థులు హాజరు కాగా 31 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

'జీలుగల కోసం పర్మిట్ తీసుకోండి'

బండిఆత్మకూరు, మే 16: రైతులు పచ్చిరొట్ట ఎరువుల సాగు చేయడానికి జీలుగల కోసం రైతు భరోసా కేంద్రాల్లో పర్మిట్ తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి స్వాతి సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలానికి 580 క్వింటాళ్ల కేటాయించినట్లు తెలిపారు. రైతు ఆధార్, పాస్‌బుక్, 1బీ, ఆధార్‌లింక్ మొబైల్ నెంబరు తీసుకుని ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 10 కేజీల జీలుగల ధర రూ.880 కాగా 50 శాతం సబ్సిడీ పోను రూ.440 చెల్లించాలని తెలిపారు.

వెలుగోడు: మండలంలోని రైతులకు 50 శాతం రాయితీపై జీలుగ విత్తనాలు ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయాధికారి పవన్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రైతులు తమ పట్టాదారుపుస్తకంతో పాటు ఆధార్ సమర్పించి నమోదు చేసుకోవాల న్నారు. మండలానికి 180 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు.

'విద్యారంగం అత్యంత కీలకం'

నంద్యాల (కల్చరల్), మే 16: సమాజంలో విద్యారంగం అత్యంత కీలకమైనది, విద్యతో పాటు విలువలు అందించాలి అని రామకృష్ణా విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం నంద్యాల రామక్రిష్ణా పీజీ కళాశాల ప్రాంగణంలో శిశు మందిర ఆచార్యుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి అనంతపురం సమితి అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి, క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, అనంతపురం సంచలన సమితి సభ్యులు డాక్టర్ ఉదయశంకర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. సరస్వతీ శిశుమందిరాల ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకోవాలి: సీఐటీయూ

నంద్యాల టౌన్, మే 16: కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన నలుగురు ముఠా కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, హమాలీ సంఘం నాయకులు జైలాన్ డిమాండ్ చేశారు. గురువారం కార్మిక శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. లక్ష్మణ్, జైలాన్ మాట్లాడుతూ హమాలీ జట్టు, ముఠా, కళాసీ కార్మికుల రాష్ట్ర ఫెడరేషన్ తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పని చేస్తూ ప్రమాదంలో గాయపడినా, కాళ్లు, చేతులు, నడుము విరిగి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు వీధుల పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఠా కార్మికులకు పని భద్రత, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల రద్దీ



క్యూలో ఉన్న భక్తులు



రుద్రగుండం కోనేరులో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు

మహానంది, మే 16: మహానంది క్షేత్రం గురువారం భక్తుల రద్దీతో కళకళలాడింది. వేసవి సెలవులు పురష్కరించుకొని తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు వివిధ వాహనాల ద్వారా క్షేత్రానికి చేరుకోవడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. గంటల కొద్దీ క్యూలో నిల్చొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయం ప్రాంగణంలోని కోనేర్లలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు.

ముంచుకొచ్చిన ముప్పు

అరకొర నీటి సరఫరాతో అవస్థలు

కొలిమిగుండ్ల రూరల్, మే 16: జనం గొంతెండుతోంది. రోజు రోజుకూ తాగునీటి సమస్య జఠిలమవుతోంది. వర్షాభావ పరిస్థితులు, మండు వేసవి కారణంగా పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా తాగునీటి ఎద్దడి తీవ్ర మవుతోంది. కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో సమస్య రోజు రోజుకూ తీవ్రతరంగా మారుతోంది. నిర్వహణ లోపం, పంపిణీ వైఫల్యాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వైసీపీ ప్రభుత్వం జల జీవన్ మిషన్ అంటూ హడావుడి చేసినా అధిక శాతం గ్రామాల్లో నేటికీ పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, సీపీడబ్ల్యూ స్కీంలు, ఎంపీడబ్ల్యూఎస్ స్కీంలు, పీడబ్ల్యూఎస్ స్కీంలు ఇలా .. పథకాలు ఎన్ని వున్నా ఆశించిన ఫలితం మాత్రం రావడం లేదు. అధికారం యంత్రాంగం వేసవి సమయంలో కాగితాల్లో కసరత్తు చేయడం తప్ప కార్యాచరణ లేదని పలువురు విమర్శిస్తున్నారు. గత ఏడాది నుండి నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా నానాటికీ భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో ఏ గ్రామంలో చూసినా తాగునీటి సమస్య జఠిలంగా మారుతోంది.

అరకొర నీటి సరఫరాతో అవస్థలు: కొలిమిగుండ్ల మండలంలో మొత్తం 32గ్రామాలు వుండగా 70వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ప్రతి మనిషికి సగటున రోజుకి 40లీటర్లు నీరు అవసరమవుతుండగా అధికార గణాంకాల ప్రకారం 20లీటర్లు నీటిని కూడా సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. సగం జనాభాకు సరిపడా నీరు అందడం లేదు. కొలిమిగుండ్లలో గత నెల రోజులుగా ప్రజలు అరకొర నీటి సరఫరాతో అల్లాడుతున్నారు. ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నా అవి ఏమాత్రం పరిపోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. కొలిమిగుండ్లతో పాటు, మీర్జాపురం, బెలుం, చింతలాయపల్లె, తిమ్మనాయినిపేట, అంకిరెడ్డిపల్లె, బి.ఉప్పలూరు, కనకాద్రిపల్లె తదితర అనేక గ్రామాల్లో అరకొర నీరు సరఫరా చేస్తున్నారు. సకాలంలో వర్షాలు లేకపోతే పరిస్థితి ఇంకెలా వుంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



జక్కసానికుంట్లలో నీటి కోసం బోరు వద్ద నిరీక్షిస్తున్న ప్రజలు

తీవ్రమైన తాగునీటి ఎద్దడి

ప్యాపిలి: మండలంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా మారింది. భూగర్భ జలాలు అడుగంటి పోవడం, రక్షిత మంచినీటి పథకాలు సక్రమంగా పనిచే యకపోవడంతో సమస్య తలెత్తింది. దీంతో ప్రజలు గుక్కెడు నీటి కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మండలంలోని కలచట్ల, జక్కసా నికుంట్ల, ఊటకొండ, చిన్నపూదిళ్ల, రాచెర్ల, జలదుర్గం తదితర గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా మారింది. ఆయా గ్రామాల్లో బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీంతో గ్రామాల్లో నీరు సరఫరా కావడంలేదు. దీంతో ప్రజలు కిలోమీటర్ల దూరంలో వ్యవసాయ బోరుబావుల దగ్గరకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. అక్కడ కూడ గుక్కెడు నీరు దొరకాలంటే గంటల తర బడి నిరీక్షించాల్సి వస్తోందని గ్రామాలు ప్రజలు వాపోతున్నారు. కలచట్ల, జక్కసానికుంట్ల, ప్యాపిలి బీసీ కాలని, చిన్నపూదిళ్ల గ్రామాల్లో ప్రజల తాగునీటి కష్టాలను కొంతవరకైనా తీర్చాలన్న ఉద్దేశంతో స్థానిక నాయకులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పం దించి నీటి పథకాలకు మరమ్మతు చేయాలని, ప్రభుత్వమే ట్యాంకర్ల ద్వారా సరిపడ తాగునీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.



కొలిమిగుండ్లలో ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా

మొసలి కన్నీరు కార్చొద్దు

- రౌడీ షీటర్లను రప్పించింది ఎవరో ఆధారాలు ఉన్నాయి
- మాజీ మంత్రి అఖిలప్రియ



మాట్లాడుతున్న అఖిలప్రియ

నంద్యాల, మే 16(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డలో తమ ఇంటి ముందు తమ బాడీ గార్డ్ నిఖిల్‌పై జరిగిన హత్యాయత్నంపై వైసీపీ నాయకులు మొసలి కన్నీరు కార్చొద్దని మాజీ మంత్రి అఖిలప్రియ సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఆమె స్వగృహంలో గురువారం మాట్లాడుతూ నంద్యాలలో రెండేళ్ల క్రితం జరిగిన కానిస్టేబుల్ హత్య కేసులో నిందితుల్లో ఒకరిని వైసీపీ నాయకుడు కిశోర్‌రెడ్డి రప్పించి దొర్నిపాడు మండలం డబ్ల్యూ.కొత్తపల్లెలో ఏజెంటుగా కూర్చోబెట్టడానికి ప్రయత్నించారని, ఇందుకు ఆళ్లగడ్డ తాలుకాలో ఓటు హక్కు లేని వ్యక్తికి అవకాశం లేదని ఎన్నికల అధికారులు చెప్పటంతో వెనుదిరిగారని అన్నారు. ఇలాంటి ఘటనలు విస్మరించి గంగుల ప్రభాకరరెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. తమ బాడీగార్డ్‌పై దాడి చేసుకోవడానికి తామే మనుషులను రప్పించుకున్నామని మాట్లాడడానికి సిగ్గుగా లేదా? అని మండిపడ్డారు. ఆళ్లగడ్డలో గత ఐదేళ్ల నుంచి జరిగిన గూండాయిజం, రౌడీయిజం, అక్రమాలు, కబ్జాలు వంటి వాటిని ఓర్వలేకనే ఇటీవల జరిగిన పోలింగులో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేకంగా ఓటు వేశారని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలు, యువత, వృద్ధులు ఓటు వేసేందుకు వేసవి ఎండలను సైతం లెక్క చేయలేదని అన్నారు. ఇది చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు రుద్రవరంలో వారంతా కార్లలో నుంచి కట్టెలు, సీసాలు బయ టకు తీసి దాడి చేసేందుకు సిద్ధమయ్యారని, ఇందుకు సంబంధించి ఆధారాలున్నాయని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజలంతా ఇలాంటి ఘటనలకు భయపడొద్దని, ప్రజలు సుఖశాంతులతో జీవించడానికి తమ వంతు సహకారం ఉంటుందని చెప్పారు.

శేషవాహనంపై జ్వాలా నరసింహస్వామి



శేషవాహనంపై విహరిస్తున్న జ్వాలా నరసింహస్వామి

నంద్యాల, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో వైశాఖ మాస నృసింహ స్వామి జయంతి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం వేకువ జామున్నే ఉత్సవమూర్తి జ్వాలా నరసింహస్వామిని విశేషంగా అలంకరించి పూజల అనంతరం అభిషేకం నిర్వహించారు. స్వామి వారిని శేషవాహనంపై మాడవీధుల్లో విహరింపచేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

నేటి నుంచి పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు

కోవెలకుంట్ల, మే 16: పట్టణంలోని రంగరాజు పేటలో వెలసిన పాండురంగ విఠలేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17వ తేదీ నుంచి 27 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఆలయాన్ని శ్రీకృష్ణ దేవరాయల కాలంలో నిర్మించారు. ప్రతి ఏడాది వైశాఖ మాసంలో 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవాల్లో భాగంగా 17న తోట ఉత్సవం, 18న ద్వాదశి కుంభహారతి, పేట కోనేటి తిరుణాల, 19న స్వామివారి కళ్యాణం, 20న స్వామివారి హను మద్వాహనం, 21న సింహ వాహనం, 22న శేషవాహనం, 23న గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగిస్తారు. 24న గజేంద్రవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 25న పూర్ణాహుతి రథోత్సవం, 26న పైల తిరు ణాల, 27న వసంతోత్సవం, నాకాబలిలో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

19 నుంచి చెన్నకేశవస్వామి..



చాగలమర్రి, మే 16: మండలంలోని వెల్లాల క్షేత్రంలో వెలసిన చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు 19 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ఈవో నర్సయ్య తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ 19న ధ్వజారోహణం, 20న శేషవాహనం, 21న సింహవానం, 22న హనుమంతోత్సవం, 23న గరుడోత్సవం, 24న గజవాహన పల్లకి సేవ, 25న రథోత్సవం, ఒంటి వాహనోత్సవం, 26న అశ్వవాహనం, 27న వసంతోత్సవం, ధ్వజారోహణం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 25న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మొదటి ఆరు బహుమతులు వరుసగా రూ.1.10 లక్షలు, రూ.75 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, అలాగే ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని

గురు చరిత్ర పారాయణం



పారాయణం చేస్తున్న రామన్నదత్త

డోన్, మే 16: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ డోన్ పట్టణ సమీపంలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో గురు చరిత్ర పారాయణం నిర్వహిస్తున్నారు. డోన్ పట్టణానికి చెందిన సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ డాక్టర్ రామన్నదత్త ఏప్రిల్ 4వ తేదీ నుంచి దత్తాత్రేయ స్వామి ఆలయం లో గురు చరిత్ర పారాయణం ప్రారంభించారు. సార్వత్రిక ఎన్ని కల్లో టీడీపీ కూటమి అత్యధిక స్థానాలు గెలుచుకుని చంద్రబాబు ముఖ్య మంత్రి పీఠం అధిరోహించాలని కోరుతూ గురు చరిత్ర పారాయణం చేప ట్టారు. చంద్రబాబు జైలులో ఉన్న సమయంలో కూడా గురు చరిత్ర పారాయణం చేశామని ఆయన తెలిపారు. డాక్టర్ రామన్న చేపట్టిన దత్తాత్రేయ గురు చరిత్ర పారాయణం గురువారానికి 43వ రోజుకు చేరుకుంది. ఎన్నికల ఫలితాలు వచ్చేంత వరకు ఇది కొనసాగుతుందని రామన్నదత్త తెలిపారు.

450 క్వింటాళ్ల జీలుగ మంజూరు

రుద్రవరం, మే 16: మండలానికి 450 క్వింటాళ్ల జీలుగ మంజూరైనట్లు ఏవో శ్రీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అవసరమైన రైతులు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కోవెలకుంట్ల: మండలంలోని ఆర్‌బీకేల్లో జీలుగ విత్తనాలను 50 శాతం సబ్సిడీతో కిలో రూ.44తో సరఫరా చేయడానికి రైతులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ గురువారం తెలిపారు. వరి పంట సాగు చేసే రైతులు తప్పనిసరిగా భూసారాన్ని పెంచుకోవడానికి జీలుగ విత్తనాలను సబ్సిడీపై పొంది సాగు చేసుకోవాలన్నారు.

'డెంగీతో అప్రమత్తంగా ఉండాలి'



మాట్లాడుతున్న డాక్టర్ ఇమ్రాన్

చాగలమర్రి, మే 16: గ్రామాల్లో ప్రజలు డెంగీతో అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు డాక్టర్ ఇమ్రాన్ సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో జాతీయ డెంగీ దినోత్సవాన్ని నిర్వహించారు. డెంగీ నివారణపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగీ నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. గృహాల వద్ద మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ప్రజలకు డెంగీ లక్షణాల గురించి అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ అంజలి, హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ నాయక్, శేఖర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బేతంచెర్ల: డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంగాపురం పీహెచ్‌సీ ప్రభుత్వ వైద్యాధికారి ప్రియాంక సూచించారు. గురువారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మండలంలోని రంగాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం కింద నీటి తొట్లను వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సచివాలయం ఏఎన్‌ఎంలు, డీవో ల్యాబ్ టెక్నీషియన్, ఆశాలు పాల్గొన్నారు.

తిరుపతిలో కారు దగ్ధం

- రూ.3 లక్షల ఆస్తి నష్టం
- ఇంజన్ వేడెక్కి, బ్యాటరీల నుంచి
- మంటలు చెలరేగడమే కారణం



దగ్ధమవుతున్న కారు

తిరుపతి(నేరవిభాగం), మే 16: ఇంజన్ వేడెక్కి.. బ్యాటరీల నుంచి మంటలు చెలరేగడంతో ఓ కారు దగ్ధమైంది. ఈ ఘటన తిరుపతి గరుడ సర్కిల్ సమీపంలో జరిగింది. నంద్యాల జిల్లా బనగానపల్లికి చెందిన ఎం. శ్రీనివాస రెడ్డి కుటుంబీకులతో తిరుమలకు వెళ్లారు. శ్రీవారి దర్శనానంతరం కారులో గురువారం తిరుపతికొచ్చారు. అనంతరం మోహన్‌బాబు కాలేజీ వద్దకెళ్లి అక్కడ తెలిసిన వారితో మాట్లాడి జూ పార్కు రోడ్డులో తిరుపతికి బయల్దేరారు. గరుడ సర్కిల్ సమీపానికి వచ్చేసరికి కారు ఇంజన్ వేడెక్కి, ఉన్నట్టుండి బ్యాటరీల నుంచి మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై వాహనంలోని వారిని దింపేయడంతో పెనుప్రమాదం తప్పింది. విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. కారు దగ్ధం కావడంతో రూ.3లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు అగ్నిమాపక శాఖ తిరుపతి జిల్లా అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న గంథాలయ జిల్లా కార్యదర్శి ప్రకాశ్

బనగానపల్లె, మే 16: బనగానపల్లె శాఖా గ్రంథాలయాన్ని జిల్లా కార్యదర్శి ప్రకాశ్ గురువారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఇతర సౌకర్యాలను గురించి పాఠకులను అడిగి తెలుసుకున్నారు. సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులతో కలసి గ్రంథాలయ ప్రాముఖ్యతను వివరించారు. గ్రంథాలయా లను వేసవిలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బషీర్ అహ్మద్ పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవం



సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

చాగలమర్రి, మే 16: చాగలమర్రి గ్రామంలోని సాయినాథ మందిరంలో గురువారం వేద పండితుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పవిత్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు సామూహికంగా జల, క్షీరాభిషేకాలు చేశారు. ప్రత్యేక హారతులతో దీపోత్సవం చేశారు. సాయి పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని రుద్రవరం, చందలూరులో గురువారం సాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందలూరు విగ్రహానికి అభిషేకం నిర్వహించారు.

డిగ్రీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న రాయలసీమ వర్సిటీ రిజిస్ట్రార్ అంకన్న

చాగలమర్రి, మే 16: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షలు పటిష్టంగా నిర్వహించాలని వర్సిటీ రిజిస్ట్రార్ అంకన్న సూచించారు. గురువారం చాగలమర్రి సెయింట్ ఆన్స్ పరీక్షా కేంద్రంలో జరుగుతున్న డిగ్రీ పరీక్షలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, విద్యార్థుల వసతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ పరీక్షా కేంద్రంలో 91 మంది విద్యార్థులకు గాను 81 మంది హాజరైనట్లు తెలిపారు. మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఎస్ కృష్ణమూర్తి, అబ్జర్వర్ నరసింహులు, ఎస్‌ఎస్‌ఎస్ అధికారి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బేతంచెర్ల, మే 16: వేసవి విజ్ఞాన సదస్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి మధుశేఖర్ సూచించారు. గురువారం బేతంచెర్ల గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన సదస్సులో భాగంగా విద్యార్థులు చదవడం, చిత్రలేఖనం వేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ వేసవి గ్రంథాలయ విజ్ఞాన సదస్సులు జూన్ 7వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగం గా కంప్యూటర్‌పై శిక్షణ ఇస్తామన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రోగ్రాం అధికారి

రుద్రవరం, మే 16: మండలంలోని నరసాపురం పీహెచ్‌సీని గురువారం అడల్ట్ రాష్ట్ర ప్రోగ్రాం అధికారి రామనాథరావు రికార్డులు పరిశీలించారు. టీబీ వ్యాధి నివారణకు బీసీజీ టీకాలు వేశారు. వ్యాధి నివారణ జరిగిన వారికి ధూమపానం తాగేవారికి టీకాలు వేశారు. 18 ఏళ్ల నిండిన షుగర్ వ్యాధిగ్రస్థులకు బీఎంఐ టీకాలు వేశారు. కార్యక్రమంలో అధికారులు లక్ష్మీప్రసన్న, బాబు, ఆలమూరు వైద్యరాలు గాయత్రి పాల్గొన్నారు.

రోగులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టంగుటూరు శ్రీనయ్య తదితరులు

బనగానపల్లె, మే 16: హైదరాబాదుకు చెందిన వసుధా ఫౌండేషన్ ద్వారా రోగులకు గురువారం జిల్లా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య తన కార్యాలయంలో రూ.30వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టంగుటూరు శ్రీనయ్య మాట్లాడుతూ వసుధా ఫౌండేషన్ సంస్థ ఈప్రాంత పేదలకు అందిస్తున్న సహకారం మరువలేని దన్నారు. పేద ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు రాకూడదనే వారికి ఆర్థిక సాయం సంస్థ అందిస్తున్నట్లు తెలిపారు. వసుధా ఫౌండేషన్ అధ్యక్షుడు మంతెన వెంకటరామరాజు సాయంతో కరోనా కష్ట కాలంలో పేదలకు ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. జోలాపురానికి చెందిన చాకలి వెంకటసుబ్బయ్య, బనగా నపల్లె పట్టణానికి చెందిన ప్రభాకర్, చెర్లోకొత్తూరుకు చెందిన బాలహు సేనమ్మకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో టీచర్ నాగరాజు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు మల్లారెడ్డి, అడ్వకేట్ నాగేంద్రారెడ్డి, టీడీపీ నాయకులు జోలాపురం మదన్‌మోహన్‌రెడ్డి, తలారి తిరుమలయ్య, బండి మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లె దస్తగిరి, బత్తుల భాస్కర్‌రెడ్డి, ఆర్‌సీ నాగిరెడ్డి, బెడదల అంకిరెడ్డి, బెడదల కృష్ణారెడ్డి, కాసుల జంగంశెట్టి, బింగుమళ్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అసంపూర్తిగా డ్రైనేజీ



అసంపూర్తిగా ఉన్న మురుగు కాలువ

రుద్రవరం, మే 16: రుద్రవరంలోని ఫాస్టు బంగ్లాకు వెళ్లే రహదారిలో మురుగు కాలువ అసంపూర్తిగా ఉంది. ప్రమాదకరంగా మారడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ద్విచక్ర వాహన దారుడు ఈ డ్రైనేజీలో పడి ప్రాణాల నుంచి బయటపడ్డాడు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు

డోన్(రూరల్), మే 16: మండలంలోని చింతలపేట గ్రామంలో పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం చెక్కభజన, బండలాగుడు పోటీలు, గుండు ఎత్తే పందెం పోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

'టీబీ నివారణకు బీసీజీ టీకా'

చాగలమర్రి, మే 16: మండలంలోని 13 సచివాలయాల పరిధిలో క్షయవ్యాధి నిర్మూలన కోసం 60 ఏళ్లు పైబడిన వారికి బీసీజీ టీకా వేస్తున్నట్లు వైద్యులు ఇమ్రాన్ తెలిపారు. గురువారం చాగలమర్రి గ్రామంలో సచివాలయాల పరిధిలో వైద్య సిబ్బంది వేస్తున్న బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 5 ఏళ్ల నుంచి టీబీ మందులు వాడి వ్యాధి నయం అయిన వారు, టీబీ వ్యాధిగ్రస్థులకు, షుగర్ వ్యాధిగ్రస్థులకు, 60 ఏళ్లు పైబడిన వారికి సచివాలయాల్లో మొదటి విడత వ్యాక్సిన్ వేశామని తెలిపారు. ప్రతి గురువారం బీసీజీ టీకాలను వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు అంజలి, హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అవుకు: టీబీ నివారణకు బీసీజీ టీకా వేయించుకోవాలని ఉప్పల పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్లు వినోద్ కుమార్, యమున, నవీన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ టీబీ, షుగర్ వాధిగ్రస్థులు ఎత్తుకు తగ్గ బరువు లేకున్న , ప్రొగ తాగేవారు, 18 నుంచి 60 సంవత్సరాలు పైబడిన వారికి బీసీజీ టీకా ప్రతి గురువారం వేస్తామన్నారు. ఈటీకాతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రావని, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ మల్లీశ్వరి, సూపర్ వైజర్లు వేణుగోపాల్ రాజు, దానమ్మ, వరలక్ష్మి, టీబీ సూపర్ వైజర్ నరసింహులు ఆరోగ్య కార్యకర్త లు వెంకటేశ్వరమ్మ, దానమ్మ మాదారమ్మ, సీహెచ్‌వోలు, ఆశాలు పాల్గొన్నారు.



అవుకులో బీసీజీ టీకా వేస్తున్న ఏఎన్‌ఎం

తాగునీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలి

కొలిమిగుండ్ల రూరల్, మే 16: మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సాయిక్రిష్ణ గురువారం వెల్లడించారు. వర్షాభావంతో భూగర్భ జలాలు అడుగంటి, నీటి సమస్యలు ఏర్ప డుతున్నాయని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రయత్నించాలని సూచించారు.

నేడు రంగాపురంలో విద్యుత్ కోత

బేతంచెర్ల, మే 16: మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో శుక్రవారం విద్యుత్ కోత విధిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు ఏడీ మధు సూదన్ రెడ్డి, రూరల్ ఏఈ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్ల విస్తరణలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.